కథ

# పట్టు

కె. వాసవదత్త రమణ

**"రేవంత్! నీదింత చీప్ మెంటాల్టీ అనుకోలేదు!" పూజ అతని వంక అసహ్యంగా చూస్తూ అంది. "పూజ! షట్ యువర్ మౌత్! తప్పంతా నువ్వు చేసి!" అతనికి మాటని కట్ చేస్తూ, "అంటే నీ దృష్టిలో నా కొలీగ్ నన్ను ఇంటి ముందు డ్రాప్ చేయడం తప్పా! బయట ఎంత వర్షంగా ఉందో చూసావా?" "ఔను, నేనది భరించలేను! నువ్వు కావాలంటే ఆటోలో రా! నే పే చేస్తాను, అంతే కాని పరాయి మగాడు నిన్ను నా యింటి ముందు దింపి వెళ్తోంటే భరించగలిగే విశాల మనస్థత్వం నాకు లేదు!" కోపంగా అన్నాడు రేవంత్!**

"ఛీ, ఛీ! ఎన్నేళ్లు గడిచినా మీ మగవాళ్ళు మారరు, ఎంత సంకుచిత ధోరణి!" ఛీత్కారంగా అంది పూజ!

"పూజ! నీ లిమిట్స్ క్రాస్ చేయకు? నేను నీకు చాలా లిబర్టీ ఇచ్చాను!"

"నువ్విస్తే పుచ్చుకునేది స్వేచ్ఛ ఎలా అవుతుంది?" నీకు ముప్ఫై వేలు వస్తే, నేను ముప్ఫై వేలు సంపాదిస్తున్నాను! నువ్విచ్చేదేమిటి?"

రేవంత్‌ని పూజ సూటిగా అడిగిన ప్రశ్నకు వాళ్ల గొడవ అంతా హాల్లో కూర్చుని వింటున్న శ్రీకాంత్‌రావుని ఆలోచనలో పడేసింది?? ఇది రోజూ ఉండే 'గొడవే' అనుకుంటూ అతని భార్య వంట పనిలో పడింది! కొడుకుది తప్పా, కోడలిది తప్పా అన్న వాదన పక్కన పెడితే, అసలు, వీళ్ళు ఒకరినొకరు ఎందుకు కట్టడి చేసుకోడానికి ప్రయత్నిస్తున్నారు? ఎవరి అధిపత్యం వాళ్ళు నిలుపుకోవాలని ఎందుకు యుద్ధానికి కాలుదువ్వుతున్నారు?

స్త్రీ, పురుషులు ఒకరినొకరు డామినేట్ చేసుకునే ప్రయత్నాల్లో ఎంత విలువైన సమయం చేజారిపోతోంది? ఎంత అందమైన జీవితం నిరర్థకంగా ముగిసిపోతోంది? అనాదిగా అణిచివేతకు గురైన స్త్రీకి 'ఓర్పు' తగ్గుతోంది! అనాదిగా అహంకారిగా నిలిచిన 'పురుషుడి'కి 'పట్టు' కోసం పట్టుదల పెరుగుతోంది?

శ్రీకాంత్‌రావుకి హఠాత్తుగా ఏన్నో ఏళ్ల క్రితం జరిగిన జ్ఞాపకాలు అలలుగా తోసుకువచ్చాయి!!! అతని కళ్ల ముందు రీలులుగా తిరిగాయి!!! బయట వర్షం ధారగా కురుస్తూనే ఉంది!!!

***

"ఏమిటండీ, మరీ మౌనంగా కానిచ్చేస్తున్నారు?" శ్రీహరిరావు బిగ్గరగా నవ్వుతూ విస్కి గ్లాసు అందుకున్నాడు!

"అబ్బే, ఏం లేదు?" శ్రీకాంత్ చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"తుఫానులా ఉంది? బయట వాతావరణం చూస్తూ ఉంటే నా చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తుకువస్తున్నాయి! అప్పట్లో ఊళ్లు ఊళ్లు కొట్టుకుపోతే ఎంతో మంది మా ఇంట్లో మిద్దె ముందుకు చేరేవారు?"

"అవునండీ! ఇంత వర్షం, ఇన్ని మెరుపులు నేనూ ఎన్నో ఏళ్ల తర్వాత చూస్తూన్నాను! సరిగ్గా ఏడేళ్ల క్రితం ఇదే వాతావరణం, ఇన్ని మెరుపులు..." ఆగాడు శ్రీకాంత్!

"అరే, ఆగిపోయారే, చెప్పండి, ఈ రాత్రికి మనకీ కాస్త కాలక్షేపం అవ్వాలి కదా!" ఆసక్తిగా ముందుకు వంగాడు శ్రీహరిరావు!

సిగిరెట్టు వెలిగించి గట్టిగా దమ్ము పీల్చాడు శ్రీకాంత్!

శ్రీహరిరావు హైదరాబాదలో పేరున్న కాంట్రాక్టరు! నలభై ఏళ్లు దాటినా చూడటానికి ముప్ఫై ఏళ్ళవాడిలా కనిపిస్తాడు! చాలా చాలా సరదా మనషి! అతను విజయవాడ పని మీద వస్తే, అనుకోకుండా ఓ ఫ్రెండు ద్వారా శ్రీకాంత్‌కి పరిచయమయ్యాడు! శ్రీకాంత్‌తో డిపార్టుమెంటు పని ఉండటంతో రెండు రోజులు అతనితో తిరిగాడు శ్రీహరిరావు!

శ్రీహరిరావు బస చేసిన హోటళ్లో రాత్రి పార్టీ చేసుకుందామని ప్లాను చేసుకున్నారు.

కాని అర్జంటు పని మీద రాలేకపోతున్నానని, వీలయితే ఎంత రాత్రైనా జాయిన్ అవుతానని వాళ్ళ ఫ్రెండ్ ఫోన్ చేయడంతో వీళ్ళిద్దరు కలిసి మొదలు పెట్టారు.

శ్రీహరిరావుతో పెద్దగా పరిచయం లేని శ్రీకాంత్ ముందు కొద్దిగా బిడియపడినా, అతని సరదా కబుర్లలో మునిగి పార్టీ ఎంజాయ్ చేసాడు!

***

"ఏడేళ్ల క్రితం నేను, నా ముగ్గురు ఫ్రెండ్స్ ఈ ఊళ్లోనే సత్యనారాయణపురంలో మేడ మీద రూమ్‌లో అద్దెకు ఉండేవాళ్లం! ఆ రోజే నేను సి.ఐ.గా సెలక్ట్ అయినట్టు లెటర్ వచ్చింది! ఫ్రెండ్స్ అందరు పార్టీ అంటూ గొడవ చేస్తే, బాటిల్స్ తెచ్చుకుని మేడ మీద రహస్యంగా పార్టీ చేసుకుంటున్నాం! ఓ రౌండ్ పూర్తయింది! ఇంతలో తలుపు చప్పుడైంది! అందరు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాం! టైం వంక చూస్తే రాత్రి పదిన్నర దాటింది! గబగబా అన్ని పక్కకి దాచేసి, తలుపు తీస్తే, కింద ఇంటి ఓనర్ వాళ్ల అబ్బాయి!!!

"మీ అమ్మగారి నుంచి ఫోన్ వచ్చింది!" అంటూ నాకు చెప్పేసి కిందకి వెళ్ళిపోయాడు!

మా వాళ్లను కానివ్వమంటూ కన్ను కొట్టి, హుషారుగా కిందకు వచ్చాను! అప్పుడే లైటుగా మత్తెక్కి గాల్లో తేలుతున్నట్టుంది!

బయట ఇలాగే కుండపోత వర్షం! ఎన్ని మెరుపులంటే నేనెప్పుడు నా జీవితంలో అన్ని మెరుపులు చూడలేదు! ఆ మెరుపుల మధ్యలో తళుక్కుమని మెరుస్తూ అజంతా సుందరిలా ఆమె కనిపించింది! ఫోన్ పక్కనే సోఫాలో కూర్చుని ఉంది!

తెల్లటి చీర, జాకెట్టు, పొడవాటి జడ, జడనిండా మల్లెపూవులు, ఎర్రటి పెదాలు, శంఖంలాంటి మెడ, తెల్లటి నడుము, ఆ నడుము మీద నున్నటి మడత– సభ్యత కూడ మరిచి ఆమె వంక అలాగే చూస్తుండిపోయాను!

"మీవాళ్లు మళ్లీ ఫోన్ చేస్తామని పెట్టేసారు, కాశీ నుంచి ఫోన్ కదా!" కూర్చోమని అంటూ ఇంటావిడ లోపలకి వెళ్లింది! ఆ మాటలేవి నా మనసు వినిపించుకోవటం లేదు! ఇంతలో ఫోన్ మోగింది! ఇద్దరం ఒక్కసారే అప్రయత్నంగా

రిసీవర్ మీద చేయి వేసాం!

ఆమె చేయి తగలగానే నా ఒళ్లు జల్లుమంది!

ఆమె 'సారీ'అంటూ రిసీవర్ చేతిలో తీసుకుని,

"నేనే, చెప్పండి, మన ఫోన్ డెడ్ అయ్యింది. వర్షం కదా!" అంటోంది మెత్తటి స్వరంతో!

ఆమె రూపం నా గుండెనిండా పరచుకుంది! ఆమె మాట్లాడుతున్నంతసేపు ఎగిరే ముంగురుల కేసి, ఊగే జూకాల కేసి, మెరిసే చెంపల కేసి మంత్ర ముగ్ధుడిలా అలా చూస్తూండిపోయాను!

ఫోన్ పెట్టగానే, మళ్లీ ఫోన్ గణ గణమంటూ మోగింది!

"మీకే, ఈసారి ఫోన్!" అంటూ నవ్వుతూ లోపలికి వెళ్లి పోయింది!

నార్త్ టూర్‌లో ఉన్న అమ్మ, నాన్నలతో మాట్లాడి బయటికి వస్తుంటే ఇంటావిడ నన్ను ఆమెకి పరిచయం చేసింది!

"వసంతా! మొన్న ఫస్టుకే అద్దెకు ఇచ్చాం వీళ్లకు! ఈ కాలపు కుర్రాళ్లు కాదు, ఎంత బుద్ధిమంతులను కున్నావు!" అంటూ చెప్పుకుంటూ వెళ్తోంది ఆవిడ!

నాకు గిల్టీగా అనిపించింది! ఆమె నా వంక చిరు నవ్వుతో చూస్తూ ఉంటే!

***

"శ్రీకాంత్! మరీ ఎక్కువగా ఫీల్ అవ్వకు! ఆమెకి పదేళ్ల కొడుకు ఉన్నాడు! ఆమె భర్తకి చాలా బిజినెస్‌లు ఉన్నాయి! మన ఎదురింటిలోనే ఉంటారు! బాగా డబ్బున్న వాళ్లురా!" ఫ్రెండ్ భుజం తడుతూ అన్నాడు రూమ్‌కి రాగానే!

నా మనస్సుకి అదేం పట్టలేదు! "ఆమెకి పెళ్లవనీ, పిల్లలుండనీ, ఏమైనా ఆమె స్నేహం కావాలి, ఆమెకి సన్నిహితంగా మసలాలి! అంతే!" దృఢంగా నిశ్చయించుకున్నాను!

ఆ వర్షపు రోజు నుంచి నాకు నిద్ర కరువైంది! కళ్లు తెరిచినా మూసినా ఆమె రూపమే!


ఆఖరికి ఆమెను మళ్ళా కలిసే అదృష్టం వాళ్ళబ్బాయి రూపంలో ఎదురు వచ్చింది!

నేను బైక్ స్టార్ట్ చేస్తూంటే, ఆ అబ్బాయి విసిరిన బంతి నాకు తగిలింది! అది ఇవ్వడానికని వాళ్ల ఇంటి ముందుకి వెళ్లాను!

ఎదురుగా లాన్‌లో నా స్వప్న సుందరి!! పచ్చటి పచ్చిక మీద అరవిచ్చిన గులాబీ పూవులా, చల్లటి చిరునవ్వుతో!!

'రండి, లోపలికి!" మర్యాదగా ఆహ్వానించింది!

ఆమె ఎదురుగా కూర్చుంటే ప్రపంచమంతా ఆహ్లాదంగా కనపడింది! అలాగే ఆమె కళ్ళలోకి చూస్తూండిపోతే ఈ జన్మకింతే చాలనిపించింది! అది ప్రేమో, ఆరాధనో కాదు, అంతకంటే ఉత్కృష్టమైన భావన!! అది మాటల్లో చెప్పలేను!!



"మా అబ్బాయి "హర్ష!" హాస్టల్లో చదువుతున్నాడు!" అంటూ మురిపెంగా ఆ పిల్లాడ్ని పక్కన కూర్చోబెట్టుకుంటూ అంది!

"మీరేం చేస్తున్నారు?" చెప్పాను!

"మా హర్ష ఎంత అల్లరి చేస్తాడో, పైకి అలా కనబడుతాడు కానీ!" అంటూ కొడుకుని గురించి కబుర్లు చెప్పింది!

"ఇక్కడే చదివించచ్చు కదా!" అప్రయత్నంగా అన్నాను!

"మా వారికి పిల్లలు హాస్టల్లో పెరిగితే క్రమశిక్షణగా పెరుగుతారని గొప్ప నమ్మకం!" ఆమె గొంతులోని బాధని ఆ పిల్లాడ్ని ఎంత మిస్ అవుతోందో నాకర్థమైంది! నా మనస్సు ఆర్ద్రమైంది!!

***

అది మొదలు మా పరిచయం! అది కూడా ఒక్క నెల రోజులు మాత్రమే! కాని నా జీవితాన్ని మార్చి వేసింది!

ఆమెతో పరిచయం పెరిగే కొలది నాలో చిన్నతనం, కుర్రతనం అన్ని క్రమేపి మాయమైపోయాయి! ఒక మహోన్నతమైన వ్యక్తిత్వంతో ఆమె నన్ను సమూలంగా మార్చేసింది! నిజానికి ఇంత వరకు నేనెవరికి కూడా ఎప్పుడు ఈ విషయం చెప్పలేదు! ఎందుకంటే చెప్పినా నమ్మరు కనుక! నన్ను నేను 'మనిషి'గా తీర్చిదిద్దుకోవడానికి ఆమె సహచర్యం నాకు చాలా తోడ్పడింది! అటువంటి వ్యక్తిని మళ్లీ ఎప్పుడూ మనం చూడలేము!" మౌనంగా ఆగిపోయాడు శ్రీకాంత్ చెబుతూ, చెబుతూ!!

***

"వెరీ ఇంట్రస్టింగ్! ఇంతకీ మీ కథకి ఎండ్ ఇవ్వలేదా!" శ్రీహరిరావు ఇంకో పెగ్ పోసుకుంటూ అన్నాడు!

"నాది ఎంత అందమైన ప్రారంభమో, అంత దారుణమైన ముగింపు!" అవేదనగా అన్నాడు శ్రీకాంత్!

"అదేమిటి??" ఆశ్చర్యంగా అన్నాడు!

"అవును, దానికి కారణం!" ఆలోచిస్తూ అన్నాడు శ్రీకాంత్!

"ఆమె భర్తా!"

"కాదు, ఆమె బావ క్రిష్ణ!"

"అతనెలా వచ్చాడు మీ మధ్యలోకి!"

"మా మధ్యలోకి కాదు, వాళ్ళ మధ్యలోకి!"

"అంటే!"???

***

"నా పోస్టింగ్ ఆర్డర్లు వచ్చాయి, భువనేశ్వర్‌లో మర్నాడే రిపోర్టింగు అంటూ!"

సంతోషంగా ముందు ఆమెకే చెబుదామని గబగబా వాళ్ళింటికి వెళ్లాను! హాల్లో ఎవరు లేరు! బెడ్‌రూమ్‌లోంచి మాటలు విన పడుతున్నాయి! అప్రయత్నంగా ఆగిపోయాను నా గురించి ప్రస్తావన వినపడతుంటే! నా చెవులు దిగ్భ్రాంతి చెందాయి!!

"ఏం చెప్పమంటావు బావా? ఆయన గురించి చెడుగా మాట్లాడాలంటేనే నాకు రంపపు కోతగా ఉంది! నిజంగా బిజినెస్సు గొడవలు, మహారాష్ట్ర దగ్గర వంతెన

పనులు అని నెలరోజుల బట్టి బిజీగా ఉన్నారనుకున్నాను! కాని కావాలనే నాకు దూరమ్మైపోయారని అస్సలు అనుకోలేదు! ఎంత పిచ్చిదాన్నో చూడూ!''

వసంత వెక్కి వెక్కి ఏడుస్తోంది! పక్కన ఎవరిదో అపరిచిత గొంతు!

''ఊరుకో, వసంతా! ప్లీజ్ ఏడవకు! నేను ఉన్నానుగా! నేను వెళ్ళి అతనితో మాట్లాడి అతని అనుమానాలన్ని తప్పని రుజువు చేస్తాను!''

''వద్దు బావ! అదింకా ప్రమాదకరం! ఆయన పైకి ఎంత అహంకారంగా ఉంటారో కాని మనస్సు అంత సున్నితం! అందులో నిన్నే అనుమానిస్తూ ఉంటే నువ్వే వెళ్ళి మాట్లాడితే ఆయన అస్సలు తట్టుకోలేరు! ఆ కోపంలో ఏదైనా చేస్తారు లేక ఆయనే ఏ అఘాయిత్యమైనా!'' గొంతు పూడుకుపోగా ఇంక మాట్లాడలేకపోయింది వసంత!!


''వసంతా!'' అతని గొంతు నిస్సహాయంగా పలికింది! కొద్దిగా కర్టెను తొలగించి చూసాను! సన్నగా పొడవుగా నల్లగా ఉన్నాడు, కాని ముఖంలో తెలియని కళ ఉంది! అలాగే ఆలోచిస్తూ నిలబడి ఉన్నాడు, వసంత కేసి జాలిగా చూస్తూ!!

''వసంతా మీ మధ్య అపార్థాలకి నేనే కారణం కావడం నిజంగా నాకు నరకంగా అనిపిస్తోంది!''

''దానికి నువ్వేం చేస్తావు బావా! మనం చిన్నప్పుడు ఒకళ్లనొకళ్లం ఇష్టపడిన మాట నిజమే! కాని పెద్దవాళ్ళ తగువులతో మన ప్రేమలు అప్పుడే మట్టి కలిసిపోయాయి! పెళ్లైన మరుక్షణం నుంచి మనసా వాచ ఆయన అర్ధాంగిగానే మసులుకున్నాను కాని మరో తలపు నాలో లేనే లేదు!!

''ఛీ, ఛీ, అయినా ఇన్నేళ్ల తర్వాత ఇంకా అనుమానము!'' ''ఏం మనిషి అతను!'' కోపంగా అన్నాడతను!!

''ఇంకా ఏం చెప్పాలి బావా? నిన్న ఫోన్‌లో



మాట్లాడుదామని ప్రయత్నిస్తూంటే ఏమన్నారో తెలుసా,

''బావ సరిపోలేదా, ఎదురింటి కుర్రాడు కుదిరాడా ఇప్పుడు!'' అన్నారు! ''ఆ మాటలకి మనస్సు పూర్తిగా వికలమ్మైపోయింది!'' బావా, ఎదురింటికి ఆ అబ్బాయి శ్రీకాంత్, అని కొత్తగా వచ్చాడు! నాకన్నా అయిదారేళ్లు చిన్నే అనుకుంటాను! ఎంతో స్నేహంగా మసులుకుంటాడు, ఆత్మీయంగా!'' మరి ఎవరు ఆయనికి ఈ చెప్పుడు మాటలన్ని మోస్తున్నారో నాకు అసలు అర్థమే కావడం లేదు!

''ఇంకెవరు, ఆ పార్టనర్ ముకుందం ఉన్నాడుగా, వాడే అయి ఉంటాడు!''

''అయినా వీళ్లను, వాళ్లని అనుకోవడం ఎందుకు బావ? అయనలో మార్పు రావాలి కాని, నా మనస్సు పూర్తిగా విరిగిపోయింది బావ, ఊళ్లో మన ఇల్లు బాగ చేయించు, అక్కడికి వెళ్లిపోతాను, ఇక్కడ నేను ఒక్కక్షణం కూడా ఉండలేను, ఈ నరకం భరించడం నావల్ల కాదు!'' వసంత భోరుమని గట్టిగా ఏడ్చేసింది!

నా మనస్సు కరిగి నీరయిపోయింది!! అలా అని లోపలికి వెళితే, ఆమెను ఇంకా బాధ పెట్టినవాడినవుతాను! అందుకే నా ఉనికిని తెలియజేయకుండా సైలెంట్‌గా బయటికి వచ్చేసాను! తర్వాత భువనేశ్వర్ చేరాక, ఆ మర్నాడే ఆమె ఇల్లు ఖాళీ చేసి వెళ్ళి పోయిందని, భర్తతో విడిపోయిందని తెలిసింది నా ఫ్రెండ్స్ ద్వారా!!''

''వసంత ఎక్కడుందో, ఏమ్మైపోయిందో ఇప్పటి వరకు మళ్ళీ నాకు తెలియనే లేదు! కాని ఆమె గుర్తుకు వస్తే మటుకు, ఆమె జీవితంలోని విషాదానికి స్నేహంతో కొంత వరకు నేను బాధ్యుడ్ని అయ్యానే అన్న బాధ ఎక్కువ కలుగుతుంది!!!''

''తేలు కుట్టిందని ఓ తల్లిని అందరుచుట్టూ చేరి పరామర్శిస్తుంటే, ఆ తల్లి పంటి బిగువున బాధను ఓర్చుకుంటూ, నయంగా, ఆ తేలు నన్నే కుట్టింది, నా పిల్లల్ని కుట్టలేదు, అదే పదివేలు!'' అందిట ఆనందంగా నవ్వుతూ! అలాంటి దేవతలాంటి తల్లి వసంత!! అలాంటి దేవతని అనుమానించిన ఆమె భర్తని షూట్ చేసి పడేయాలి!!'' ఆవేశంగా అన్నాడు ముగింపుగా!!!!

వర్షం ఇంకా కూరుస్తూనే ఉంది ధారగా!!!! మెరుపులు ఇంకా మెరుస్తూనే ఉన్నాయి!

***

ఫోన్ మోగింది!

''హలో!'' అన్నాడు శ్రీకాంత్!!!

''నేను శ్రీహరిరావును!''

''హలో, బావున్నారా? ఎప్పుడొచ్చారు?'' హుషారుగా అడిగాడు!!

''అసలు నే వెళితే కదా రావడానికి!''

''అంటే!'' ఆశ్చర్యంగా అన్నాడు!

''అన్నీ చెబుతాను, సాయంత్రం చిన్న పార్టీ! రండీ'' అంటూ అడ్రసు చెప్పాడు!

''మళ్లీనా, అయినా ఇవ్వాళ వర్షం

లేదుగా, మజా ఉండదు!''

శ్రీకాంత్ మాటలకి శ్రీహరిరావు బిగ్గరగా నవ్వాడు!

***

''వెల్‌కం, రండి!'' శ్రీహరిరావు హుషారుగా అన్నాడు ఎదురుగా వస్తూ,

''సోఫాలో కూర్చుంటుంటే శ్రీకాంత్‌కి పక్కన కూర్చున్న అతన్ని ఎక్కడో చూసినట్టనిపించింది! కాని గుర్తుకు రాలేదు! ఆ పక్కనే అతని భార్య!

''శ్రీకాంత్! నీకో సర్‌ప్రైస్'' అన్నాడు శ్రీహరిరావు!

'పార్టీ అన్నాడు కాని అసలా వాతావరణమే లేదు' మనసులో అనుకుంటూ పైకి చిరునవ్వు నవ్వాడు శ్రీకాంత్!!

''వసు!'' అంటూ గట్టిగా పిలిచాడు శ్రీహరిరావు!!!

''మీట్ మై వైఫ్, మై లైఫ్!'' అంటూ పరిచయం చేసాడు!

ఎదురుగా వసంత!!!

తన కళ్లను తానే నమ్మలేకపోయాడు శ్రీకాంత్! చాలా కాలానికి ఆత్మీయుల్ని చూడగానే ఆనంద బాష్పాలు పలకరించినట్టు, అతని కళ్లలో తెలియకుండానే నీళ్ళు నిండాయి!

అదే అందం! అదే ప్రశాంతత! అదే చల్లటి చూపు! శ్రీకాంత్‌కి అప్రయత్నంగా చనిపోయిన తన తల్లి గుర్తుకు వచ్చింది!!

''శ్రీకాంత్! ఎలా ఉన్నావు!'' ఎన్నాళ్లయింది నిన్ను చూసి!'' వసంత అభిమానం కళ్లలో కురుస్తుండగా అడిగింది!

ఆనందంతో అతని మనస్సు మూగపోయింది!

''బాగానే ఉన్నాను!'' అస్పష్టంగా అన్నాడు!

''శ్రీకాంత్, కొద్దిగా లావైనట్టున్నావు?'' మళ్లీ తనే అంది!

''కొద్దిగా బొజ్జ కూడా వచ్చింది!'' శ్రీహరిరావు నవ్వుతూ అన్నాడు!

''అబ్బా బావా, ఈయనతో ఎలా వేగడం!'' అలకగా అంది వసంత పక్కనున్న అతనితో!

అప్పుడు వెలిగింది శ్రీకాంత్‌కి, పక్కన చూసినట్టున్న వ్యక్తి వసంతకి బావ అని!!! అతనే క్రిష్ణ అని!!!

ఆశ్చర్యంగా శ్రీహరిరావు వంక చూసాడు!

''శ్రీకాంత్ చిన్నవాడి వయినా నా కళ్లు తెరిపించావు!!! వయస్సులో ఉన్న పొగరు, చెప్పుడు మాటల హోరు నన్ను గుడ్డివాడ్ని చేసాయి! నా జీవితాన్నే పొగొట్టుకునేలా చేసాయి!

ఆ దేముడే, నిజంగా నిన్ను ఆ దేముడే మళ్లీ మమ్మల్ని ఇలా కలపడానికి పంపించాడేమో? నీ మాటల వల్ల నా కళ్ళు తెరుచుకున్నాయి, నీవల్లే నేను మూర్ఖుడిగా చేజార్చుకున్న వసంత మళ్లీ నాకు దక్కింది! ఆ దేవత నన్ను క్షమించింది! నన్ను కరుణించింది! నా ఇంటికి తిరిగి వచ్చింది!'' గద్గదికంగా అన్నాడు శ్రీహరిరావు!

''ఊరుకోండి, మనలో మనకి క్షమాపణ లేంటి?'' ఓర్పుగా భర్త భుజం మీద చేయి వేసింది వసంత!

''శ్రీహరిరావు గారు! మీరెవరో తెలియక మొన్న వర్షం రాత్రి ఏవేవో మాట్లాడేసాను! నేను తప్పుగా మాట్లాడి ఉంటే మీరు నన్ను క్షమించాలి! ఆమె అద్భుతమైన స్త్రీ! ఆమెను భార్యగా పొందిన మీరు చాలా అదృష్టవంతులు!'' శ్రీకాంత్ అన్నాడు షాక్ నుంచి తేరుకుంటూ!!

''ఐనో దట్! కాని మీరే నన్ను క్షమించాలి! నేనే చాలా తప్పులు చేసాను! నన్ను చేసుకుని వసంత చాలా బాధలు పడింది! యాదృచ్ఛికంగా మనం కలవడం, నేనెవరో తెలియకుండా మా ఇద్దరి జీవితాల్లో జరిగిన కొన్ని సంఘటనలు నీ నోటి ద్వారా వినడంతో అసలు నిజమేమిటో నాకు తెలిసి వచ్చింది! ఈ కథలో నేనెంత విలన్‌గా మారిపోయనో నా కర్థమైంది! వెంటనే వెళ్లి వసంతకు క్షమాపణ చెప్పుకుని మళ్లీ జీవితాన్ని ఫ్రెష్‌గా మొదలుపెట్టడానికి, ఆమెని ఒప్పించాను! ఇదంతా నీ వల్లే జరిగింది! శ్రీకాంత్, ఐయామ్ వెరీ థాంక్‌ఫుల్ టూ యూ!'' ఉద్వేగంగా అన్నాడు శ్రీహరిరావు!!

''మీరు చాలా మంచి డెసిషన్ తీసుకున్నారు! మీరిద్దరు ఒక్కటయ్యారు, మాకంతే చాలు!'' క్రిష్ణ అన్నాడు.

శ్రీహరిరావు క్రిష్ణ భుజం చుట్టూ చేయి వేసి,

''మీరంతా నన్ను క్షమించాలి! మీ అందరి మంచితనం గ్రహించుకోలేని మూర్ఖుడ్ని నేను!'' అన్నాడు!

''అదంతా గతం, ఇప్పుడెందుకు అది, రండి భోజనాలు వడ్డించాను'', వసంత ఆప్యాయంగా అందర్ని పిలిచింది!!!

నిర్మలమైన ఆమె ముఖం వంక చూస్తూ ''ఆ దేముడు ఇప్పటికైనా ప్రపంచంలోని ఆనందాన్నంతా ఆమె ఒడిలో పోయాలి!'' అనుకున్నాడు శ్రీకాంత్ మనసులో!!!

***

''శ్రీకాంత్, నన్ను షూట్ చేయాలన్నావు ఆ రోజు, ఆ కోపం తగ్గిందా?'' హాస్యంగా అన్నాడు శ్రీహరిరావు! భోజనాలు అయ్యాక!!

''అది కాక ఇంకా చాలా చాలా చెప్పాను!'' భయపడుతున్నట్టుగా ముఖంపెట్టి అన్నాడు శ్రీకాంత్!!

''అవ్వన్ని వయస్సు చేసే గమ్మత్తులు!'' అంతే!

''శ్రీకాంత్! వయస్సు హోరు, చేతిలో డబ్బు మనుషుల్ని రేసు గుర్రాలుగా పరుగెత్తిస్తాయి! ముఖ్యంగా మగవాడ్ని! అప్పుడు కొంచెం మనస్సును అదుపులోకి తెచ్చుకోగలిగితే జీవితం సుఖంగా సాగుతుంది!'' లేకపోతే నాలా...''

''అబ్బా, అవ్వన్ని మర్చిపోండి? ఇప్పుడు అంతా హ్యాపీ కదా!'' శ్రీకాంత్ నవ్వుతూ అన్నాడు దూరంగా కనిపిస్తున్న వసంతను ఆనందంగా చూస్తూ!''

***

గతం నుంచి వర్తమానంలోకి వచ్చాడు శ్రీకాంతరావు! లోపల రేవంత్, పూజల ఘర్షణ తారస్థాయిని అందుకుంది!

''ఏమండీ! రండి, భోజనం వడ్డించాను!'' భార్య పిలుపుతో లోపలికి కదిలాడు!

''మరి, వాళ్ళు,'' భోజనానికి కూర్చోబోతూ అన్నాడు! చిన్నగా నవ్వుతూ,

''ఆ కాసేపయితే, కోపతాపాలు తగ్గి వాళ్ళే వచ్చి తింటారు! తెల్లారేటప్పటికి పాలు నీళ్ళలా కలిసిపోతారు! మీరు తినండి లేటయితే మళ్ళీ అరగదు! అన్నం వడ్డిస్తూ అంది!!''

''అవునవును, కెరటాలు ఎంత లోనుకున్నా సముద్రాన్ని వదలవు కదా! ఇప్పుడు మనం జాగ్రత్త పడాల్సింది 'మన ఆరోగ్యం' కోసం!!!'' అంతే! అంతే!!'' నవ్వాడు శ్రీకాంత్‌రావు!

✻

# యాక్టింగ్ 'రాంపాల్'



డాన్, ఓం శాంతి ఓం, రాక్ ఆన్, ది లాస్ట్ లియర్.. చిత్రాలు చూసిన వారు అర్జున్ రాంపాల్‌ని మరచిపోరు. ఎందుకంటే ఈ చిత్రాల్లో హీరోకి ఫ్రెండ్‌గా మెప్పించాడు.. విలన్‌గా మంచి మార్కులు కొట్టేశాడు.. ఏది చేసినా బెస్ట్ సపోర్టింగ్ కేరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు అర్జున్ రాంపాల్. మోడల్‌గా ప్రారంభమైన అర్జున్ కెరియర్ యాక్టర్‌గా మంచి పేరు తెచ్చుకోవడమే కాకుండా నిర్మాతగా కూడా బాలీవుడ్‌లో వెలుగుతున్నాడు. అయితే ఇకపై యాక్టింగ్‌కు మరింత పదును పెట్టే దిశగా సాగుతున్నాడు. అర్జున్ తాజాగా ప్రకాశ ఝా సినిమా 'రాజ్‌నీతి'లో ఓ పొలిటీషియన్ కేరెక్టర్ వేయబోతున్నట్టు సమాచారం. అదే తోవలో, సుధీర్ మిశ్రా సినిమా 'హూ ఈజ్ స్పీకింగ్' అనే ఓ సైలెంట్ థ్రిల్లర్‌కు కూడా సంతకం చేసినట్టు తెలిసింది.